వేసవికి ముందే వార్నింగ్ బెల్స్

ఇటీవల సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం ధర్మారంలో ఎండిపోయిన వరి పొలాన్ని చూపుతున్న రైతులు

- వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- నిరుటితో పోల్చితే 1.5 మీటర్ల తగ్గుదల
- మరింత దారుణంగా కృష్ణా బేసిన్
- ముమ్ముందు మరింత దారుణ పరిస్థితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): వేసవి ఇంకా చురుక్కుమనిపించక ముందే రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. నిరుటితో పోల్చితే రాష్ట్రవ్యాప్తంగా సగటున 1.5 మీటర్ల లోతుకు పడిపోయాయి. వేసవి రాకముందే పరిస్థితి ఇలా ఉంటే ముమ్ముందు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. గత డిసెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 859 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 6 శాతం అధికంగా 914 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయినప్పటికీ నిరుడు ఇదే సమయంతో పోల్చితే భూగర్భ జలాలు ఒకటిన్నర మీటర్ల దిగువకు పడిపోవడం గమనార్హం. రాష్ట్రంలో గత నెల సగటు భూగర్భ జలమట్టం 6.8 మీటర్లు ఉండగా, ప్రస్తుతం అది 7.72 మీటర్లుగా నమోదైంది. నాలుగు జిల్లాల్లో సగటు భూగర్భ జలమట్టం 0.32 నుంచి 5 మీటర్ల లోపు ఉండగా, 25 జిల్లాల్లో 5 నుంచి 10 మీటర్లు, మిగిలిన 4 జిల్లాలో 10 మీటర్లకు మించిన లోతులో భూగర్భ జలాలు ఉన్నట్టు భూగర్భజలశాఖ నివేదిక తెలిపింది. ప్రాజెక్టుల నుంచి ఆశించిన స్థాయిలో నీటిని విడుదల చేయకపోవడం, గతంలో మాదిరిగా చెరువులను క్రమం తప్పక నింపకపోవడమే అందుకు కారణమని అర్థమవుతున్నది. గత ప్రభుత్వం క్రమం తప్పకుండా చెరువులు, చెక్ డ్యాములను నింపడం వల్ల మండువేసవిలోనూ భూగర్భ జలమట్టం పడిపోకుండా స్థిరంగా ఉన్నది. ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితి ఉండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

కృష్ణా బేసిన్‌లో మరింత దారుణం

కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు ఈసారి ఆశించిన స్థాయిలో వరదలు రాకపోవడంతో ఈ బేసిన్ పరిధిలో భూగర్భ జలాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. శ్రీశైలం, సాగర్ తోపాటు పలు ప్రాజెక్టులు ఇప్పటికే డెడ్ స్టోరేజీకి చేరవలో ఉన్నాయి. ప్రాజెక్టులు నిండకపోవడంతో పంటలు వేసుకోవద్దని అధికారులు రైతులకు సూచించారు. కాలువల ద్వారా నీటి విడుదల ఆగిపోవడంతో బేసిన్ పరిధిలోని రైతులు బోరుబావులపై ఆధారపడి యాసంగి పంటను సాగుచేశారు. భూగర్భ జలమట్టం మరింత కిందికిపడిపోవడానికి ఇది కారణమైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 3.57మీటర్లకు భూగర్భ జలాలు పడిపోగా, నల్లగొండలో 3.41మీటర్లు, వికారాబాద్‌లో 3.26 మీటర్లు, మహబూబ్‌నగర్‌లో 3.12 మీటర్లు, రంగారెడ్డి జిల్లాలో 2.93 మీటర్లు, నారాయణపేటలో 2.72మీటర్లు, సూర్యాపేటలో 2.74 మీటర్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2.38మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోవడంతో అందరిలోనూ ఆందోళన వ్యక్తమవుతున్నది.

గోదావరి బేసిన్‌లోనూ అంతంతే

సమృద్ధిగా వర్షాలు కురిసినా, ఆశించిన స్థాయిలో వరద వచ్చినా గోదావరి బేసిన్‌లోనూ ఈ ఏడాది భూగర్భజలాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. 2019లో కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి గోదావరి జలాలను పరిపూర్ణంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ఆ ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, నిజాంసాగర్, సింగూరు, ఎగువ మానేరు, దిగువ మానేరు, కడెం, వరదకాలువ తదితర ప్రాజెక్టులను అనుసంధానించి అవసరం మేరకు ఎప్పటికప్పుడు జలాలను ఎత్తిపోసి, తద్వారా ఆయా ప్రాజెక్టులకు కింద ఉన్న చెరువులను క్రమం తప్పకుండా నీటితో నింపారు. మేడిగడ్డ డ్యామేజీ పేరిట ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది చెరువులు, చెక్‌డ్యాంలు నింపడం లేదు. ఫలితంగా గోదావరి బేసిన్‌లోనూ భూగర్భజలాలు త్వరితగతిన అడుగంటుతున్నాయి.

భూగర్భ జలమట్టం పడిపోయిన జిల్లాలు

జిల్లా	నిరుడు	ఈ ఏడాది (మీటర్లలో)	తరుగుదల
ఆదిలాబాద్	6.70	6.99	0.29
భద్రాద్రికొత్తగూడెం	7.68	7.98	0.25
జయశంకర్ భూపాలపల్లి	7.26	7.98	0.72
హనుమకొండ	4.48	6.82	2.34
హైదరాబాద్	6.86	8.19	1.33
జగిత్యాల	4.19	4.65	0.46
జనగామ	5.57	6.87	1.30
జోగులాంబ గద్వాల	5.55	6.53	0.98
కామారెడ్డి	8.84	10.95	2.11
కరీంనగర్	6.21	6.67	0.46
ఖమ్మం	4.46	5.46	1.00
కుమ్రంభీం ఆసిఫాబాద్	6.44	7.11	0.67
మహబూబాబాద్	4.22	5.11	0.89
మహబూబ్‌నగర్	5.76	8.88	3.12
మంచిర్యాల	4.90	5.79	0.89
మెదక్	10.46	11.46	1.00
మేడ్చల్ మల్కాజిగిరి	7.60	9.38	1.78
నాగర్‌కర్నూల్	5.07	8.64	3.57
నల్లగొండ	5.27	8.68	3.41
నారాయణపేట	5.02	7.74	2.72
నిర్మల్	6.50	7.87	1.37
నిజామాబాద్	8.91	10.06	1.15
రంగారెడ్డి	6.91	9.84	2.93
సంగారెడ్డి	9.75	9.80	0.05
సిద్దిపేట	7.28	8.96	1.68
రాజన్నసిరిసిల్ల	6.43	8.70	2.27
సూర్యాపేట	4.49	7.23	2.74
వికారాబాద్	8.72	11.98	3.26
వనపర్తి	3.67	4.75	1.13
వరంగల్	4.01	4.46	0.45
యాదాద్రి	4.91	7.29	2.38
పెద్దపల్లి	4.91	4.78	0.14 (పెరుగుదల)
సగటు	6.22మీటర్లు	7.72మీటర్లు	1.50 మీటర్లు (తరుగుదల)



నీరులేక బోసిపోయిన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూర్ రిజర్వాయర్ ప్రధాన కాలువ

నగరంలో ట్రాఫికర్

హైదరాబాద్ నగరంలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారు. ఓవైపు ఎండవేడిమి, మరోవైపు వాహనాల కాలుష్యంతో సతమతమవుతున్నారు. లక్డీకాపూల్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం స్తంభించిపోయిన ట్రాఫిక్.

పంచాయతీ సిబ్బంది కోసం ప్రత్యేక కమిటీ

- పనికి తగిన వేతనాలు, గుర్తింపు ఇస్తాం
- పంచాయతీరాజ్ మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది మొదలు కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. ప్రగతిభవన్‌లో గ్రామపంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్ల క్యాలెండర్‌ను శుక్రవారం మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది పనికి తగిన వేతనాలు, గుర్తింపు ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. సిబ్బంది భయంతో కాకుండా ప్రేమతో పని చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత పాటించాలని కోరారు. జీవో 51ని రద్దుకు ప్రయత్నిస్తానని తెలిపారు. అర్హత గల బిల్ కలెక్టర్లను పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించడం రాష్ట్రవ్యాప్తంగా, జనాభా ఆధారంగా గ్రామాలను నాలుగు గ్రేడ్లుగా విభజిస్తూ, ప్రతి గ్రామానికి ట్రాఫిక్ ప్యాటర్న్ నిర్ణయించాలని ఈ సందర్భంగా మంత్రిని కారోబార్, బిల్ కలెక్టర్ల అసోసియేషన్ నాయకులు కోరారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యజ్ఞ నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆర్కే నాయుడు, పంచాయతీ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్‌మోహన్, తెలంగాణ పంచాయతీ కార్యాలయ సిబ్బంది అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూమయ్య యాదవ్, గౌరవ సలహాదారు రాధాకృష్ణ, గౌరవ అధ్యక్షుడు మునావర్, వివిధ జిల్లాల నుంచి బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబర్ కోసం వ్యక్తి హత్య

నర్సంపేట రూరల్, ఫిబ్రవరి 16: అంబర్ (గుట్కా) కోసం ఇద్దరు గొడవపడగా ఒకరి ప్రాణం పోయిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలోని ద్వారకపేటలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ద్వారకపేటకు చెందిన ఒగ్గుల రాజు (37), అదే గ్రామానికి చెందిన ముత్యం ప్రశాంత్ ఈ నెల 14న మేస్త్రీ రవి ఇంటికి విందుకు వెళ్లారు. అనంతరం తనకు అంబర్ కావాలని ప్రశాంత్ అక్కడే ఉన్న రాజును అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. ఈ క్రమంలో రాజుపై ప్రశాంత్ పిడిగుద్దులు కురిపించడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి ఒగ్గుల రాజు మృతి చెందాడు. శుక్రవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శీలం రవి తెలిపారు.

గర్శకుర్తిలో మరమగ్గాల కార్మికుల ఆందోళన

- బతుకమ్మ చీరల తయారీకి అనుమతివ్వాలి
- పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్

కరీంనగర్ జిల్లా గర్శకుర్తిలో ఆందోళన చేస్తున్న పవర్‌లూమ్స్ కార్మికులు

గంగాధర, ఫిబ్రవరి 16: బతుకమ్మ చీరల తయారీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మరమగ్గాల కార్మికులు డిమాండ్ చేశారు. విజిలెన్స్ అధికారులు దాడులను నిలిపివేసి, కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో పవర్‌లూమ్స్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజిలెన్స్ అధికారులు మరమగ్గాలను సీజ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులపై కేసులు పెట్టడంపై ఆవేదన వ్యక్తం చేశారు. విజిలెన్స్ అధికారులు వెంటనే దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేసులను వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత జీవోను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

రైతులపై బీజేపీ దమనకాండ

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, ఫిబ్రవరి 16(నమస్తే తెలంగాణ): దేశ రాజధాని ఢిల్లీ వేదికగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులపై దమనకాండ కొనసాగిస్తున్నదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. అన్ని పార్టీలు రైతులకు మద్దతుగా నిలువాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ... మద్దతు ధరకు చట్టబద్ధత, పంట రుణాల మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు నిరసన తెలిపితే బీజేపీ ప్రభుత్వం విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. గతంలో తెచ్చిన నల్ల చట్టాలను ఉపసంహరించుకొన్న మోదీ.. జాతికి క్షమాపణలు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ రైతులపై అదే ధోరణిని కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఢిల్లీకి కాంగ్రెస్ సూట్‌కేసులు

- రాహుల్‌గాంధీ కోసం బిల్డర్లకు బెదిరింపులు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అబిడ్స్‌లో నిర్మించనున్న రాంజీ గోండు స్మారక మ్యూజియానికి శుక్రవారం శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలకులు ఢిల్లీకి సూట్‌కేసులు మోస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాహుల్‌గాంధీ కోసం కాంట్రాక్టర్లను, బిల్డర్లను, కంపెనీలను బెదిరిస్తూ డబ్బు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ నాయకుడు వెల్లాల రామ్మోహన్ తన అనుచరులతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కర్నాటక కాంగ్రెస్ నుంచి సూట్ కేసులు వస్తే.. ఇప్పుడు తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతాయని, ఆరు గ్యారెంటీలను మాత్రం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన పీవీ నర్సింహారావును కాంగ్రెస్ అవమానిస్తే, మోదీ ప్రభుత్వం గౌరవించిందని చెప్పారు. తొమ్మిదన్నరేండ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఇచ్చిందని వివరించారు.

రాంజీగోండు పేరిట స్మారక మ్యూజియం

గిరిజనుల ఆత్మగౌరవ పోరాటయోధుడు రాంజీ గోండు పేరిట హైదరాబాద్ అబిడ్స్‌లో స్మారక మ్యూజియాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు వర్చువల్‌గా హాజరైన కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండాతో కలిసి మ్యూజియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడారు. గిరిజనుల ఆత్మగౌరవం కోసం బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా రాంజీ గోండు పోరాడారని కొనియాడారు. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా మాసబ్ ట్యాంకులో రూ.6.5 కోట్లతో ట్రైబల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించినట్టు తెలిపారు. గిరిజన విద్యను ప్రోత్సహించడానికి రూ.420 కోట్లతో తెలంగాణలో 17 ఏకలవ్య ఇన్‌స్టిట్యూట్లను కేంద్రం ప్రారంభించిందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు.

కేంద్రంపై కార్మిక, కర్షకుల కన్నెర్ర

- వ్యతిరేక విధానాలపై నిరసన జ్వాల
- గ్రామీణ భారత్‌బంద్‌లో ర్యాలీల జోరు.. నినాదాల హోరు
- దేశవ్యాప్త సమ్మెలో ప్రజాసంఘాల ధర్నాలు
- నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన ప్రదర్శనలు

హైదరాబాద్ బహిరంగసభలో వివిధ ప్రజా సంఘాల నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నాయకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై నిరసన జ్వాల వెల్లువెత్తింది. శుక్రవారం నిర్వహించిన దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. నల్లబ్యాడ్జీలతో నిరసనలు, ధర్నాలు చేసి కేంద్రంలోని బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం, గణపురం, మహదేవపూర్, జనగామ జిల్లా కేంద్రం, దేవరుప్పుల, మహబూబాబాద్, కురవి, ఇనుగుర్తి, కేసముద్రం, డోర్నకల్, బయ్యారం, గార్ల మండలాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు తీసి ధర్నా చేశారు. తొర్రూరు, నర్సింహులపేట, పెద్దవంగర, చిన్నగూడూరులో మహాప్రదర్శన నిర్వహించారు. ములుగు ప్రభుత్వ దవాఖానలో కార్మికులు, వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వాజేడు, వెంకటాపూర్(నూగూరు)లో ర్యాలీ, వరంగల్ ఎంజీఎం సెంటర్‌లో మానవహారం చేపట్టారు. నర్సంపేట, నెక్కొండ, వర్ధన్నపేట, హనుమకొండ జిల్లా కాజీపేట, కమలాపూర్‌లో ర్యాలీలు నిర్వహించారు.

రాస్తారోకోలు.. నిరసన ర్యాలీలు

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకోలు, నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. నిర్మల్ పట్టణంతోపాటు నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన, గోలేటి సీహెచ్‌పీల వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ, బీపీ ఏవోసీపీ గనులతో పాటు వివిధ డిపార్ట్‌మెంట్లు, గోలేటి జీఎం కార్యాలయంలో కార్మికులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పెంచికల్‌పేట్, మంచిర్యాల, కోటపల్లి, దండేపల్లి, శ్రీరాంపూర్, నస్పూర్, బెల్లంపల్లి, జైపూర్, మందమర్రిలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నిరసన తెలిపారు. తాండూర్, బెల్లంపల్లిలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కూడళ్లలో మానహారం

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ర్యాలీలు నిర్వహించడంతోపాటు మానవహారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిరసనలు హోరెత్తాయి. వివిధ వామపక్ష పార్టీలతోపాటు ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎస్, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. పలు చోట్ల మానవహారం చేపట్టి రాస్తారోకో చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారత్ బంద్ విజయవంతమైంది. సింగరేణి కార్మికులు విధులకు గైర్హాజరయ్యారు.

అంబానీ, అదానీ ప్రయోజనాలే మోదీకి ముఖ్యం: కూనంనేని

కవాడిగూడ, ఫిబ్రవరి 16: ప్రధాని మోదీకి పారిశ్రామికవేత్తలైన అంబానీ, అదానీ ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన 16వ పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌కు సంఘీభావంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టిందని దుయ్యబట్టారు. కార్మికుల చట్టాలను మార్చి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారులకు మేలు చేసే చర్యలు తీసుకుంటూ వచ్చారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వివిధ పక్షాల నేతలు, పలు పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నెగ్గిన అవిశ్వాసం.. ఆగిన గుండె

- గుండెపోటుతో తాజా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మృతి
- ఇటీవలి అవిశ్వాసంతో మానసిక ఒత్తిడి తట్టుకోలేక హఠాన్మరణం

రమేశ్‌గౌడ్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16 : అవిశ్వాసం నెగ్గడంతో తన భార్య మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిందన్న మనస్తాపంతో ఆమె భర్త గుండె ఆగిపోయింది. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో చోటుచేసుకున్నది. ముత్యం సునీత సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కాగా ఇటీవల ఆమెపై కొందరు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఆ తీర్మానం నెగ్గడంతో సునీత తన పదవిని కోల్పోయారు. ఈ ఘటనతో ఆమె భర్త బీఆర్ఎస్ నాయకుడు ముత్యం రమేశ్‌గౌడ్ శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు వెంటనే సుల్తానాబాద్ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్టు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తరలించారు. రమేశ్‌గౌడ్‌కు భార్య సునీతతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్‌తోపాటు కౌన్సిలర్లు తదితరులు రమేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

4 ఎల్ కెనాల్‌కు గండి

- దెబ్బ తిన్న పంట పొలాలు.. వృథాగా నీరు

మానకొండూర్ మండలం పచ్చునూర్ శివారులోని 4 ఎల్ కెనాల్‌కు గండిపడిన ప్రాంతం

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 16 : కాకతీయ కాలువకు అనుబంధంగా ఉన్న కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామ శివారులోని 4 ఎల్ కెనాల్‌కు గురువారం గండిపడింది. దీంతో నీరు వృథాగా పోవడంతోపాటు నీటి ప్రవాహంతో దాదాపు 25 ఎకరాల్లో పంట పొలాలు సైతం దెబ్బతిన్నాయి. ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు.

రాయికల్ మున్సిపాలిటీ వీగిన అవిశ్వాసం

రాయికల్, ఫిబ్రవరి 16 : జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్‌పర్సన్ గండ్ర రమాదేవిపై తొమ్మిది మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. గతంలో తొమ్మిది మంది ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని జగిత్యాల ఆర్డీవో, ప్రత్యేకాధికారి నరసింహమూర్తి శుక్రవారం రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రవేశపెట్టారు. అవిశ్వాస తీర్మానానికి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తోపాటు ఏడుగురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానానికి 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్‌కు చెందిన ఒక కౌన్సిలర్, బీజేపీకి చెందిన ఒక కౌన్సిలర్ మాత్రమే హాజరయ్యారు. దీంతో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్టు ఆర్డీవో ప్రకటించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బీఆర్ఎస్ కౌన్సిలర్లతో సంప్రదింపులు జరిపి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య సయోధ్య కుదిరించడంతో అవిశ్వాసం వీగిపోయింది.